PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :162 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం. 28.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్

Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED

ప్రభాత సూర్యుడు

www.prabhathasuryudu.com

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews

70326 93467

WANTED REPORTERS

# హైడ్రా.. భారీ ఆపరేషన్

## హస్మత్ పేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- 10 ఎకరాల భూమిని పరిరక్షించిన అధికారులు
- మార్కెట్లో దీని విలువ 750 కోట్లు ఉంటుందని అంచనా






హైదరాబాద్,ప్రభాత సూర్యుడు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేటలో శనివారం హైడ్రా భారీ కూల్చివేతలు చేపట్టింది. సుమారు ₹750 కోట్ల విలువైన, 10 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కబ్జాదారుల నుంచి విడిపించారు. పురావస్తు శాఖ భూములుగా ఉన్న ఈ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ప్రికాస్ట్ కాంపౌండ్ వాల్స్, తాత్కాలిక షెడ్లను అధికారులు తొలగించారు.సర్వే నంబర్ 1 లో మొత్తం 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, కాలక్రమేణా అందులో దాదాపు 98 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. మిగిలిన 10 ఎకరాలను కాపాడేందుకు రెవెన్యూ శాఖ చేసిన అభ్యర్థన మేరకు.. భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీల సహాయంతో ఈ డ్రైవ్‌ను నిర్వహించారు. హస్మత్‌పేట్ ప్రాంతంలోని సర్వే నంబర్1 చత్రిగడ్డ వద్ద అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు రంగంలోకి దిగారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను గుర్తించిన హైడ్రా బృందం, భారీ యంత్రాల సహాయంతో వాటి తొలగింపు ప్రక్రియను ప్రారంభించింది. కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ సంఖ్యలో పోలీసులు, డీఆర్ఎఫ్, ఎస్‌ఓటీ సిబ్బందిని మోహరించారు. నాలుగు వైపులా భద్రతా వలయం ఏర్పాటు చేసి అధికారులు కూల్చివేతలను కొనసాగిస్తున్నారు. కూల్చివేతల ప్రాంతానికి సాధారణ ప్రజలను, ఇతర వ్యక్తులను అనుమతించకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

### 108 ఎకరాల భూమిని పరిరక్షించేందుకు..

అన్యాక్రాంతమైన సుమారు 108 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు విక్రయాలు కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ భూకబ్జా వ్యవహారంలో కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. సంబంధిత అంశాలపై విచారణ కొనసాగుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాల పరిరక్షణలో భాగంగా అక్రమ ఆక్రమణలపై హైడ్రా కఠిన చర్యలు కొనసాగిస్తోందని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుండగా, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# రెండేళ్లలో 500 నగరాలకు 'భారత్ ట్యాక్సీ' సేవలు: అమిత్ షా

ఢిల్లీ :ప్రభాత సూర్యుడు హోం మంత్రి అమిత్ షా గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని చెప్పారు.ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు.భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు.భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ



మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులు ముందుకు సాగాలి: మంత్రి సీతక్క



హైదరాబాద్, జూన్ 27 ప్రభాత సూర్యుడుదివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ–ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ–ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ–ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం: మంత్రి పొన్నం



హైదరాబాద్, జూన్ 27ప్రభాత సూర్యుడు తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన ప్రక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి: మంత్రి తుమ్మల





భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 ప్రభాత సూర్యుడు గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**అధికారులు సమన్వయం చేసుకోవాలి..**

జిల్లా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణేశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ప్లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

## వేలేరు గ్రామంలో రూ.45 లక్షల సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

ప్రభాత సూర్యుడు /వరంగల్ వేలేరు, జూన్ 27:వేలేరు మండల కేంద్రంలో మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మంజూరైన రూ.45 లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేలేరు మేజర్ గ్రామపంచాయతీ



సర్పంచ్, వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ఇప్పటికే తొలి విడతలో రూ.30 లక్షలు, ప్రస్తుతం రెండో విడతలో రూ.45 లక్షలు, మొత్తం రూ.75 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు.గ్రామంలోని మిగిలిన వీధుల్లో కూడా దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు గ్రామాన్ని జిల్లా స్థాయిలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రదీప్, వార్డు సభ్యులు రణధీర్ రెడ్డి, సునీల్, అలాగే సతీష్, రాజయ్య, రామస్వామి, రవి, సంపత్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల హామీలను వెంటనే అమలు చేయాలి

### పేదలకు ఇళ్ల పట్టాల కోసం జూలై 1న ధర్నా: సీపీఐ నాయకుడు పబ్బు వీరస్వామి పిలుపు

ప్రభాత సూర్యుడు /నల్లగొండ, జూన్ 27 ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్న ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ




జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో జూలై 1న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో టౌన్ కమిటీ సమావేశం కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరస్వామి మాట్లాడుతూ, నల్లగొండ పట్టణంలో గత ఐదేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేద కుటుంబాలు శాశ్వత నివాసం కోసం ఎదురుచూస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, 2002, 2005 సంవత్సరాల ఓటరు జాబితాలను బీఎల్ఓలకు అందుబాటులో ఉంచి అర్హుల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పింఛన్ మొత్తాన్ని రూ.6,000లకు పెంచడంతో పాటు ప్రజలకు ఇచ్చిన అన్ని ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి వి. లెనిన్, నాయకులు కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, ఎం. నందం, సద్దాం సీతారాములు, దోటి అక్కలయ్య, వల్కి వెంకటేష్, యూసుఫ్, వీరయ్య, నర్సింహా, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై యుద్ధానికి నల్లగొండ పరుగులు

## 2కే రన్‌లో కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి యువత అడుగులు

ప్రభాత సూర్యుడు :/నల్లగొండ, జూన్ 27 : మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "డ్రగ్ ఫ్రీ నల్గొండ -- డ్రగ్ ఫ్రీ తెలంగాణ'' అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు 2కే రన్



ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ యువతతో కలిసి పరుగెత్తి మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, "మాదకద్రవ్యాలకు నో... ఆరోగ్యవంతమైన జీవితానికి యెస్" అంటూ యువతకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ విక్రయాలు, అక్రమ రవాణాపై సమాచారం అందించిన వారికి గోప్యత కల్పిస్తూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేస్తేనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐలు సైదాబాబు, శివప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అక్రమాలపై సీఎం జోక్యం చేసుకోవాలి: తెలంగాణ విద్యావంతుల వేదిక

ప్రభాత సూర్యుడు నల్లగొండ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 28న నల్లగొండ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకుంటున్న అక్రమాలు, అవినీతి, విద్యార్థుల సమస్యలు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది పందుల సైదులు బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా విద్యార్థులపై సస్పెన్షన్లు, పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని, ప్రశ్నించే హక్కును అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. 2012లో జరిగిన 31 టీచింగ్ పోస్టుల నియామకాల్లో రోస్టర్, రిజర్వేషన్ నిబంధనలను ఉల్లంఘించి అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ కమిటీలు నివేదికలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఆ నివేదికలను బహిర్గతం చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విశ్వవిద్యాలయంలో 130కు పైగా టీచింగ్ పోస్టులు, పలు నాన్-టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, ఇంజినీరింగ్ కళాశాలకు ఇప్పటికీ శాశ్వత టీచింగ్ పోస్టులు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఖాళీలను రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా భర్తీ చేయాలని కోరారు.ఇటీవల జరిగిన ఔట్‌సోర్సింగ్ నియామకాలలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా విజిలెన్స్ కమిటీతో స్వతంత్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై నమోదైన కేసులు, సస్పెన్షన్లను ఉపసంహరించడంతో పాటు హాజరు శాతం కారణంగా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా ప్రత్యేక కండోనేషన్ విధానం అమలు చేయాలని కోరారు. హాస్టళ్లు, తాగునీరు, నాణ్యమైన భోజనం, లైబ్రరీ, వై-ఫై వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని, పెండింగ్ భవనాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సేవాలాల్ మహారాజ్ వంటి మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించాలని, విశ్వవిద్యాలయంలో రాజ్యాంగ విలువలపై కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ముఖ్యమంత్రి నల్లగొండ పర్యటనను మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో న్యాయం, పారదర్శకత, ప్రజాస్వామ్య పరిపాలన పునరుద్ధరణకు చారిత్రాత్మక ఆరంభంగా మార్చాలని పందుల సైదులు తన బహిరంగ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి: సీఐటీయూ డిమాండ్

### ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ విడుదల

ప్రభాత సూర్యుడు:/నల్లగొండ, జూన్ 27 యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నల్గొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పేరుతో రూపొందించిన బహిరంగ లేఖను విడుదల



చేసింది.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల పన్నుల ధనంతో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్ర విద్యుత్ రంగానికి కీలకమైన ఆస్తి అని పేర్కొన్నారు. ప్రజలకు చౌకగా, నాణ్యమైన విద్యుత్ అందించడమే ఈ ప్లాంట్ ప్రధాన లక్ష్యమని, ప్రైవేటీకరణ వల్ల విద్యుత్ ఉత్పత్తి, పంపిణీపై ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెరిగి ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా ప్రైవేటీకరణ కారణంగా ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత దెబ్బతినడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం దృష్ట్యా ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.సీఐటీయూ విడుదల చేసిన బహిరంగ లేఖలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు సంబంధించిన అన్ని చర్యలను వెంటనే నిలిపివేయాలని, ప్లాంట్‌ను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని, కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులను పరిరక్షించాలని, ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. సలీం, జిల్లా ఉపాధ్యక్షుడు దండంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు, అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు గంజి రాజేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. బహిరంగ లేఖపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. సలీం సంతకాలు చేశారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కలెక్టర్ పర్యవేక్షణ

### ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, యాప్ అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

కూకట్‌పల్లి, జూన్ 27 ప్రభాత సూర్యుడు:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. హౌసింగ్





బోర్డు తిరుమ హిల్స్ ప్రాంతంలో బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి అందజేస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎల్ఓల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఉదయం బీఎల్ఓల హాజరును తప్పనిసరిగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎన్ని ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేశారో, ఒక్కో కుటుంబానికి ఎన్ని పత్రాలు అందజేస్తున్నారో, ఎన్యూమరేషన్ యాప్ ద్వారా వివరాలను ఎలా అప్‌లోడ్ చేస్తున్నారో బీఎల్ఓలను ప్రశ్నించి తెలుసుకున్నారు.దీనికి స్పందించిన బీఎల్ఓలు, అవసరాన్ని బట్టి ఒక్కో కుటుంబానికి రెండు వరకు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేస్తున్నామని, పత్రాల పంపిణీ అనంతరం క్యూఆర్ కోడ్ సాయంతో సెల్‌ఫోన్ ద్వారా వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని వివరించారు.ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేసిన వెంటనే వాటి వివరాలను తప్పనిసరిగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బీఎల్ఏలతో సమన్వయం చేసుకుని గుర్తించి, వారికి కూడా ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి తహసీల్దార్ అశోక్, సంబంధిత శాఖల అధికారులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను ఆహ్వానించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రభాత సూర్యుడు: /హైదరాబాద్, జూన్ 27: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆదివారం తన నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్న పలు అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి సీతక్కను ఆహ్వానించారు.అనంతరం మంత్రి సీతక్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, మంత్రి సీతక్క తనకు సొంత సోదరి లాంటివారని పేర్కొంటూ, ఆమెతో తనకు ఉన్న ఆప్యాయ అనుబంధాన్ని గుర్తుచేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి: బీసీ విద్యార్థి సంఘం

### జూన్ 30న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపు



ప్రభాత సూర్యుడు జూన్ 27:పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, జీవో నెం. 8, 9లను రద్దు చేసి పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ డిమాండ్ చేశారు.బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు, మెమోలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి నెలకొందని అన్నారు.పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించిన ఆయన, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూన్ 30న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల బంద్‌కు బీసీ విద్యార్థి సంఘం పిలుపునిచ్చిందని, ఈ బంద్‌కు కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.డిమాండ్లు నెరవేర్చని పక్షంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కృష్ణన్న ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉప్పు లోకేష్, చేకూరి శివ, పొరపాటు కిషోర్, రూపాని చరణ్, కోన్ రెడ్డి మహేష్ రెడ్డి, వడ్లకొండ మనోహర్, కృష్ణ, నగేష్, రామన్న, మల్లికార్జున్, వెంకన్న, సురేష్, సతీష్, విజయకుమార్, చెన్నూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు హత్యల కేసు: అసలు నిందితుల అరెస్ట్‌పై స్పందించిన బుష్రా, అర్హాన్.. తప్పుడు ప్రచారం నిలిపివేయాలని విజ్ఞప్తి

ప్రభాత సూర్యుడు:/నల్గొండ, జూన్ 27: నాలుగు హత్యల కేసులో అసలు నిందితులను జిల్లా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని స్వాగతిస్తూ బుష్రా, అర్హాన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, దర్యాప్తు పూర్తికాకముందే సోషల్ మీడియాలో ఆధారాలు లేకుండా తమ ఫోటోలు వైరల్ చేసి, తామే హంతకులమని ప్రచారం చేయడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు."ప్రేమించి పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో ప్రశాంతంగా జీవిస్తున్నాం. కానీ చేయని నేరానికి మమ్మల్ని దోషులుగా చిత్రీకరించారు. అసలు నిందితులు దొరికినా ఇప్పటికీ చాలామంది మమ్మల్నే అనుమానంతో చూస్తున్నారు. దీంతో మా పరువు, మా జీవితం దెబ్బతిన్నాయి" అని వారు పేర్కొన్నారు.తమ తల్లిని కోల్పోయిన బాధ ఒకవైపు ఉండగా, చేయని నేరానికి నిందలు ఎదుర్కోవాల్సి రావడం మరోవైపు తీవ్ర వేదన కలిగించిందని బుష్రా భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర వేదికల్లో తమ ఫోటోలతో పాటు తప్పుడు ఆరోపణలతో ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు.అలాగే, వాస్తవాలు నిర్ధారించకుండా ఎవరినీ నిందితులుగా ప్రచారం చేయవద్దని మీడియా, సోషల్ మీడియా వినియోగదారులకు బుష్రా, అర్హాన్ విజ్ఞప్తి చేశారు. "మా గౌరవాన్ని తిరిగి ఇవ్వండి" అంటూ భావోద్వేగంగా కోరారు.

## నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

### పెన్షన్ దారులు, ప్రభుత్వ ఆసుపత్రి రోగుల అటెండెంట్లకు ఉచిత భోజన పంపిణీ

ప్రభాత సూర్యుడు:/నకిరేకల్, జూన్ 27: సమాజ సేవే లక్ష్యంగా నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ కోటగిరి శ్రీనివాస్ సహకారంతో పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద పెన్షన్ తీసుకునేందుకు వచ్చిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఆహారాన్ని పంపిణీ చేశారు.అనంతరం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల అటెండెంట్లకు "ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్" కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మందికి ఉచిత భోజనం అందించారు.ఈ కార్యక్రమానికి నకిరేకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షత వహించగా, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, కార్యదర్శి సూర్య చంద్రరావు, కోశాధికారి అండెం వెంకన్నతో పాటు పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దాత కోటగిరి శ్రీనివాస్ అందించిన సహకారాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.



# భర్త ఆత్మహత్యకు కారకులైన ఐదుగురికి జైలు శిక్ష

## కొత్తగూడెం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
## పోలీస్ అధికారులను ఘనంగా సన్మానించిన మృతుడి తల్లి




అశ్వారావుపేట జూన్ 28(ప్రభాత సూర్యుడు)కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధం కారణంగా మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో.. అతని మరణానికి కారకులైన ఐదుగురు నిందితులకు కొత్తగూడెం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు బుధవారం కఠిన కారాగార శిక్షలు మరియు జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించి నారు. వివాహేతర సంబంధమే ప్రాణం తీసింది.. అశ్వరావుపేట మండలం పేరాయిగూడెం నెహ్రూ నగర్‌కు చెందిన తగరం ముత్యాలరావు స్థానిక కెమిలా ఎయిడ్స్ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. అతని భార్య శ్యామల, అదే గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వరరావు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అంతేకాకుండా, ప్రియుడితో కలిసి భర్త ముత్యాలరావును మానసికంగా తీవ్రంగా హింసించేది. దీనితో తీవ్ర మనస్తాపానికి గురైన ముత్యాలరావు, 2018 జూలై 31న సదరు ఫ్యాక్టరీ వెనుక ఉన్న మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను ఆత్మహత్య చేసుకోవడానికి తన భార్య శ్యామల, ఆమె ప్రియుడు తగరం వెంకటేశ్వర్లు, అతని అన్న తగరం పుల్లారావు, తండ్రి తగరం రామారావు, తల్లి నరసమ్మలే కారణమని ముత్యాలరావు తన సూసైడ్ నోట్‌లో స్పష్టంగా పేర్కొన్నాడు. 14 మందిపై కేసు నమోదు.. మృతుని భార్య వివాహేతర సంబంధం విషయమై గతంలో పలుమార్లు పంచాయితీలు చేసిన నారాయణపురం గ్రామానికి చెందిన మరో 9 మందితో కలిపి మొత్తం 14 మందిపై ఆనాటి అశ్వరావుపేట ఎస్ఐ వేల్పుల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. (జతీ.చీశ: 178/2018 ఖ/o 306 =/ష 34 ఞూజ) కింద కేసు నమోదు చేసి పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. కోర్టు ఖరారు చేసిన శిక్షల వివరాలు:సుదీర్ఘ వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో కొత్తగూడెం అడిషనల్



అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కవిత బుధవారం ఈ క్రింది విధంగా తీర్పునిచ్చారు:భార్య శ్యామలకు: 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష. ప్రియుడు వెంకటేశ్వరరావుకు: 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష. బంధువు తగరం పుల్లారావుకు: 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష. రామారావు, నరసమ్మలకు: 3 సంవత్సరాల సాధారణ కారాగార శిక్ష. జరిమానా: నిందితులందరికీ ఒక్కొక్కరికి 10,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసులకు ఘన సన్మానంఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా అహర్నిశలు శ్రమించి, పక్కా ఆధారాలతో పురోగతి సాధించిన అశ్వరావుపేట పోలీస్ అధికారులను మృతుడి తల్లి తగరం తిరుపతమ్మ ఈరోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఘనంగా శాలువాలతో సన్మానించారు. అప్పటి ఎస్ఐ వేల్పుల వెంకటేశ్వరరావు, ప్రస్తుత ఎస్ఐ మధు ప్రసాద్, కోర్టు కానిస్టేబుళ్లు బి. నాగేశ్వరరావు, ప్రశాంత్‌లను ఆమె అభినందించారు. ఈ తీర్పుతో తన కుమారుడి ఆత్మకు శాంతి చేకూరిందని తిరుపతమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. అలాగే ఈ కేసులో ఇంకా కొందరికి శిక్ష పడాల్సి ఉందని, వారిపై జిల్లా కోర్టులో అప్పీలుకు వెళ్తానని ఆమె ఈ సందర్భంగా విలేకరులకు తెలియజేశారు.

# నేడు పల్స్ పోలియో కార్యక్రమం

**– అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి**
**– 39,509 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యం : డాక్టర్ ప్రియాంక**

అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు:అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఈ నెల 28న (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 114 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయగా, సుమారు 39,509 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణ కోసం 10 రూట్ సూపర్వైజర్ వాహనాలు, 3 మొబైల్ బృందాలు, 4 ట్రాన్సిట్ పాయింట్లు, 125 వ్యాక్సిన్ క్యారియర్లు మరియు అవసరమైన ఐస్ ప్యాక్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని 7 హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, సూపర్వైజర్లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. జూన్ 28న ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఇప్పటికే సాధారణ టీకాలు తీసుకున్న పిల్లలకు కూడా పల్స్ పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ ఇంటింటి సర్వే ప్రారంభం

బడంగ్‌పేట్ – ప్రభాత సూర్యుడు:ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఇంటింటి సర్వే శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ సర్కిల్ ఏఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య బీఎల్‌ఓ సూపర్వైజర్లతో కలిసి జిల్లెలగూడ పరిధిలోని పలు పోలింగ్



స్టేషన్లను సందర్శించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక, నిర్వహణ సమస్యలు, ప్రజల స్పందన తదితర అంశాలపై బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం స్థానిక నివాసులతో మాట్లాడిన ఆయన, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించి ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. అలాగే పేరు మార్పులు, చిరునామా సవరణలు, కొత్త ఓటరు నమోదు, అనర్హుల పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే నాణ్యమైన ఓటరు జాబితా రూపొందించడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ సూపర్వైజర్లు బాలరాజ్, నర్సింహా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై విస్తృత అవగాహన

**ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వివరాల ధృవీకరణపై సూచనలు**

శామీర్ పేట్ జూన్ 27 ప్రభాత సూర్యుడు: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) మూడో రోజు సందర్భంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్‌లోని దేవరయాంజాల్ గ్రామంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 154, 157 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.



ఈ సందర్భంగా ప్రతి ఓటరు తన వివరాల ధృవీకరణపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బీఎల్‌ఓలు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూర్తి చేసి తిరిగి సమర్పించాలని కోరారు. ఫారాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉండవచ్చని ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, వ్యక్తిగత వివరాల్లో సవరణలు, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణ వంటి అంశాలపై కూడా ప్రజలకు సమగ్రంగా వివరించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, బీఎల్‌ఓలు అందించే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని నాయకులు, అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ పి. మధుసూదన్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, సూపర్‌వైజర్లు రజీత, జానీ, బీఎల్‌ఓలు ఎం. ఆనంద్, సి. వీరమణి, డి. సరస్వతి, కరిమునిషా, జి. రాధ, బీఎల్ఏ జి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆపదలో నిరుపేద కుటుంబానికి సర్పంచ్ టోనీ చేయూత.

సింగరేణి జూన్ 27 ప్రభాత సూర్యుడు నిరుపేద ఇంటి నిర్మాణానికి



సింగరేణి సర్పంచ్ ఆర్థికసాయం చేసి మానవత్వం చాటారు. సింగరేణి గ్రామంలోని నిరుపేద షాబీర్ కుటుంబం ఇంటి నిర్మాణం చేయటానికి ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థిక సంస్థలు దగ్గర అప్పు చేసి ఇల్లు కడదామన్నా అప్పు సైతం పుట్టక పోవటంతో ఇంటి నిర్మాణం ఆపేశాడు. ఈక్రమంలో షాబీరు ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మేదర వీర ప్రతాప్ (టోనీ) మానవతా దృక్పథంతో స్పందించారు. సామాజిక బాధ్యతగా ఆ కుటుంబానికి రూ. 10వేలు నగదు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలు, అవసరమైన కుటుంబాలకు తనవంతు సహాయం అందించడం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు ఆదుకోవటానికి దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ అందించిన ఆర్థిక సాయానికి షాబీర్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల ప్రెసిడెంట్ షేక్ తాజుద్దీన్, ప్రముఖ వ్యాపారవేత్త సురేందర్ మణియర్, వార్డు సభ్యులు ఎండీ యాకుబ్ అలీ,గ్రామ పెద్దలు జకియా, మతిన్,యాకూబ్ పాషా, సిరజుద్దీన్, అఫ్సర్, రియాజ్, అజమ్, జావేద్, సికిందర్, కబీర్, మేదరి వెంకన్న, కిరణ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం

**– రంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి**
**– 4.20 లక్షల మందికి పైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యం**

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28న (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో రోగనిరోధక



కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి తెలిపారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,688 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో పట్టణ ప్రాంతాల్లో 493, గ్రామీణ ప్రాంతాల్లో 1,195 బూత్‌లు ఉన్నాయి. జిల్లాలోని 4,20,911 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు 167 రూట్ సూపర్వైజర్ వాహనాలు, 50 మొబైల్ బృందాలు, 53 ట్రాన్సిట్ పాయింట్లు, 55 ప్రచార వాహనాలు, 12 జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారులు, 43 కోల్డ్ చైన్ కేంద్రాలు, 2,010 వ్యాక్సిన్ క్యారియర్లు మరియు అవసరమైన ఐస్ ప్యాక్‌లను సిద్ధం చేశారు. అలాగే జిల్లాలో గుర్తించిన 481 హైరిస్క్ ప్రాంతాల్లో నివసిస్తున్న 6,213 మంది చిన్నారులకు ప్రత్యేక బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6 మంది ప్రోగ్రామ్ అధికారులు, 5 మంది డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, 54 మంది వైద్యాధికారులు, 61 మంది స్టాఫ్ నర్సులు, 153 మంది సూపర్వైజర్లు, 474 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, 1,317 మంది ఆశా కార్యకర్తలు, 1,600 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు/ఆయాలు, 604 మంది నర్సింగ్ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, జూన్ 28న ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సాధారణ టీకాలు పొందిన పిల్లలకు కూడా పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# గ్రామీణ రవాణ సౌకర్యాలే లక్ష్యంగా రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపన.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.**

ఖమ్మం/కూసుమంచి, జూన్–27 ప్రభాత సూర్యుడు .గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో మొత్తం రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో తండాలు, గ్రామాల ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల కారణంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని



ఈ పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహ దారులు, వంతెనలు నిర్మించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు అత్యవసర సేవలు, విద్య, వ్యవసాయ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుందని అన్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు. అధికారులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జెడ్పీ రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే జెడ్పీ రోడ్డు నుంచి కొత్తూరు––ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్‌సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ళ చెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు వంతెనల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

# సర్వేఫారం పరిశీలించి నింపే పద్ధతి ఓటర్లకు తెలియజేయాలి.

**కారేపల్లి లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే.**




సింగరేణి జూన్ 28ప్రభాత సూర్యుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) లో అర్హులైన ఏ ఒక్క ఓటు కోల్పోకూడదని, అర్హులైన ఓటు హక్కు పదిలంగా ఉండాలని ఎమ్మెల్యే మాలోత్‌హాహౌరాందాస్ నాయక్ సర్వే అధికారులకు సూచించారు. శనివారం కారేపల్లి మండలం లో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే భాగ్యనగర్ తండా లో సర్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. బీఎల్వో లు అందజేస్తున్న సర్వే ఫారం పరిశీలించి దానిని నింపే పద్ధతి ఓటర్లకు సవీరంగా తెలియజేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా నింపి మరల దరఖాస్తులను ఇంటికి వచ్చినప్పుడు బిఎల్ఓలకు అందజేయాలని ఓటర్లను కోరారు. సవరణలు చేర్పులు, మార్పులు ఉన్నా సరే ఇచ్చిన ఫారంలో సరిదిద్దుకోవచ్చని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో కార్యదర్శులు, బిఎల్ఏలు అత్యంత జాగ్రత్తగా సవరణ ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, కారేపల్లి సర్పంచ్ మేదరి ప్రతాప్ (టోనీ ),సూర్య తండా సర్పంచ్ బానోత్ రాందాస్, నాయకులు గుగులోతు భీముడు, భగవాన్ దాస్, సుధాకర్, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.




# అదే కాంబో.. అదే సెంటిమెంట్.. అనిల్ మరో హిట్‌కు స్కెచ్ వేసేశాడా?



ముఖ్యంగా శ్రీనివాస్ రెడ్డి టైమింగ్, రఘుబాబు స్పెషల్ డైలాగ్ డెలివరీకి అనిల్ రాసే కామెడీ సీన్స్ బాగా సెట్ అవుతాయని ఇప్పటికే పలుమార్లు రుజువైంది. కామెడీని తన సినిమాల ప్రధాన బలంగా మార్చుకుని వరుస సక్సెస్‌లు అందుకుంటున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి మరోసారి తనకు బాగా కలిసి వచ్చిన సెంటిమెంట్‌ను కొనసాగిస్తున్నట్లు టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే ఎంటర్టైన్మెంట్ ను అందించడంలో ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న అనిల్, ప్రతి సినిమాలో కథకు తగ్గట్టుగానే కామెడీ ట్రాక్‌ను డిజైన్ చేస్తుంటాడు. అందులో భాగంగానే తనకు బాగా వర్కౌట్ అయిన నటీనటులను పదేపదే రిపీట్ చేయడం ఆయనకు అలవాటుగా మారింది. ప్రస్తుతం వెంకటేష్, కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్‌లో కూడా శ్రీనివాస్ రెడ్డి, రఘుబాబు కీలక కామెడీ పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ వార్త బయటకు వచ్చినప్పటి నుంచి అనిల్ రావిపూడి మరోసారి తన సక్సెస్ కామెడీ ఫార్ములాను నమ్ముకున్నాడనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో వ్యక్తమవుతోంది అనిల్ కెరీర్‌ను పరిశీలిస్తే ఈ సెంటిమెంట్ కొత్తదేమీ కాదు. తన మొదటి సినిమా పటాస్ నుంచి సుప్రీమ్, రాజా ది గ్రేట్, ఆ తర్వాత వచ్చిన పలు సినిమాల వరకు శ్రీనివాస్ రెడ్డి, రఘుబాబులకు కథలో ప్రాధాన్యం ఉన్న పాత్రలు ఇచ్చాడు. కేవలం రెండు మూడు కామెడీ సీన్లకే పరిమితం చేయకుండా, కథను ముందుకు తీసుకెళ్లే క్యారెక్టర్లుగా వారిని ఉపయోగించడం అనిల్ స్పెషాలిటీ అని చెప్పాలి. అదే కారణంగా ఆ క్యారెక్టర్లు ఆడియన్స్ మదిలో నిలిచిపోయాయి. ముఖ్యంగా శ్రీనివాస్ రెడ్డి టైమింగ్, రఘుబాబు స్పెషల్ డైలాగ్ డెలివరీకి అనిల్ రాసే కామెడీ సీన్స్ బాగా సెట్ అవుతాయని ఇప్పటికే పలుమార్లు రుజువైంది. థియేటర్లలో ఆడియన్స్ పొట్టచెక్కలయ్యేలా నవ్వుకున్న ఎన్నో సీన్స్ ఈ కాంబినేషన్ నుంచే వచ్చాయి. అందుకే ఈ ఇద్దరు మరోసారి అనిల్ సినిమాలో కనిపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.


# జయకృష్ణకు హిట్ ఇస్తే గేమ్ చేంజ్..





అజయ్ భూపతి ప్లాన్ ఇదే సొంత అన్నయ్య కొడుకు సినిమా కావడం, వెనుక అశ్వినిదత్ లాంటి అగ్ర నిర్మాతల సపోర్ట్ ఉండటంతో ఈ సినిమాకు భారీ బిజినెస్ జరుగుతోంది.ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో వారసుడు వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. సూపర్ స్టార్ మహేష్ బాబు అన్నయ్య, దివంగత రమేష్ బాబు కొడుకు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస మంగాపురం' వచ్చే నెల 9న విడుదలవుతోంది. ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన డైరెక్టర్ అజయ్ భూపతి ఈ సినిమాతో జయకృష్ణను గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కి హిట్ ఇస్తే అజయ్ రేంజ్ పెరగడమే కాకుండా, ఆయన కెరీర్ గేమ్ చేంజ్ అవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ వివరాలు చూద్దాం.. ఈసారి పక్కా మాస్ రూట్: ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి సినిమాలతో డిసెంట్ సక్సెస్ అందుకున్న అజయ్ భూపతి ఎప్పుడూ డిఫరెంట్ కథలనే ఎంచుకుంటాడు. అయితే ఈసారి జయకృష్ణ కోసం ఆయన రూట్ మార్చాడు. 'శ్రీనివాస మంగాపురం' ఒక ప్యూర్ లవ్ స్టోరీ అయినప్పటికీ, ఇందులో థియేటర్లలో ఈలలు వేయించే రేంజ్‌లో పక్కా మాస్, కమర్షియల్ ఫ్లేవర్ ఉండేలా ప్లాన్ చేశాడు. ఇక ఈ మాస్ కంటెంట్ కొత్త హీరోకు ప్లస్ అవుతుందని అజయ్ గట్టి నమ్మకంతో ఉన్నాడు. మహేష్ బాబు గుడ్ బుక్స్ లో చోటు: గతంలో రామ్ చరణ్‌ను పూరీ జగన్నాథ్, మహేష్, బన్నీలను రాఘవేంద్రరావు సక్సెస్‌ఫుల్‌గా ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఇప్పుడు అజయ్ భూపతి కూడా అదే రేంజ్‌లో జయకృష్ణకు ఒక బంపర్ హిట్ ఇస్తే, ఆయన క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుంది. అంతేకాకుండా తన అన్న కొడుకును సక్సెస్‌ఫుల్‌గా లాంచ్ చేసినందుకు మహేష్ బాబు గుడ్ బుక్స్ లో కూడా అజయ్ చోటు సంపాదించుకుంటాడు. ఇక దీనివల్ల భవిష్యత్తులో మరిన్ని మెరుగైన అవకాశాలు వస్తాయి. ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు మహేష్ బాబు చీఫ్ గెస్ట్:సొంత అన్నయ్య కొడుకు సినిమా కావడం, వెనుక అశ్వినిదత్ లాంటి అగ్ర నిర్మాతల సపోర్ట్ ఉండటంతో ఈ సినిమాకు భారీ బిజినెస్ జరుగుతోంది. వచ్చే వారం జరగబోయే గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు మహేష్ బాబు ముఖ్య అతిథిగా రాబోతున్నారు. తన అల్లుడి లాంచింగ్ మూవీ గురించి మహేష్ ఏం మాట్లాడబోతున్నారా అని అటు అభిమానులు, ఇటు చిత్ర యూనిట్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు స్పెషల్ అట్రాక్షన్: ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ రవీనా టాండన్ కూతురు రషా తదాని హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇందులో ఒక పవర్‌ఫుల్ పాత్ర పోషించడం సినిమాకు పెద్ద అసెట్. గతంలో రమేష్ బాబుతో కలిసి నటించిన మోహన్ బాబు.. ఇప్పుడు ఆయన కొడుకు జయకృష్ణతోనూ స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అజయ్ భూపతికి ఈ శ్రీనివాస మంగాపురం సినిమాతో మెప్పించాల్సిన బాధ్యత ఎక్కువగా ఉంది. ఘట్టమనేని వారసత్వాన్ని నిలబెడుతూ జయకృష్ణను ఒక మాస్ హీరోగా ప్రెజెంట్ చేయడంలో అజయ్ సక్సెస్ అయితే, ఇండస్ట్రీలో ఆయన రేంజ్ మారిపోతుంది. వచ్చే నెల 9న రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# ఐటమ్ పాటను తప్పుగా చూసే రోజుల్లో ఊర్మిళ సాహసం!



ఏళ్ల తరబడి బాలీవుడ్ చిత్రసీమలో అత్యంత ప్రజాదరణ పొందిన నృత్య గీతాలలో ఒకటిగా నిలిచిన -చమ్మా చమ్మా- పాట అసలు ఊర్మిళ కనిపించకపోయేదేమో! బాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ఆదరణ పొందిన నృత్య గీతాలలో -చమ్మా చమ్మా- ఒకటి. ఈ అద్భుతమైన పాటలో తన అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ప్రముఖ నటి ఊర్మిళా మాతోండ్కర్ తన కెరీర్‌లోనే అత్యంత మరపురాని ఈ పాట గురించి ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసారు. అప్పట్లో ఐటెం సాంగ్స్ పై ఉన్న కొన్ని సామాజిక అపోహల కారణంగా... తాను ఈ చార్ట్‌బస్టర్ పాటలో నర్తించడానికి మొదట్లో పూర్తిగా నిరాకరించానని ఒక పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో ఐదవ సీజన్‌లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నప్పుడు వెల్లడించారు. 1998లో వచ్చిన -చైనా గేట్- చిత్రంలోని ఈ స్పెషల్ ట్రాక్ మేకింగ్ గురించి ఊర్మిళా మాట్లాడుతూ.. అప్పట్లో ఈ సాంగ్ ఆఫర్ తన వద్దకు ఎలా వచ్చిందో గుర్తుచేసుకున్నారు. అగ్ర దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి ఈ సినిమాలో ఒక ప్రత్యేక ఐటెం సాంగ్‌లో నటిస్తే బాగుంటుందని తనను కోరినట్లు ఊర్మిల చెప్పారు. అయితే ఆ కాలంలో ఐటెం సాంగ్స్‌ను ప్రేక్షకులు... పరిశ్రమ వర్గాలు చాలా ప్రతికూల కోణంలో చూసేవారని.. అందుకే తాను దానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నానని పేర్కొన్నారు. కానీ ఆ తర్వాత దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తన అద్భుతమైన విజన్‌ను వివరించి.. తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశారు. గతంలో ఎన్నో ఏళ్ల క్రితం వచ్చిన కొన్ని నృత్య గీతాలను, వాటి కొరియోగ్రఫీని ప్రజలు ఇప్పటికీ ఎలాగైతే గుర్తుపెట్టుకుంటారో.. అదే విధంగా కాలేజీ యువత నుండి సామాన్యుల వరకు అందరి మనస్సుల్లో నిలిచిపోయేలా అంతకంటే మెరుగైన ఒక క్లాసిక్ సాంగ్‌ను సృష్టించడమే తన లక్ష్యమని దర్శకుడు ఊర్మిళకు నమ్మకం కలిగించారు. ఈ క్రమంలోనే ఆ పాట చిత్రీకరణకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన తెరవెనుక రహస్యాన్ని కూడా ఊర్మిళా షేర్ చేసారు. ఈ పాట షూటింగ్‌ను పూర్తి చేయడానికి కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య మాస్టర్ మొదట 12 రోజుల పాటు సుదీర్ఘమైన ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. మూడు రోజుల్లోనే ముగిసిన షూటింగ్: అయితే ఊర్మిళా అంకితభావం, అద్భుతమైన నృత్య ప్రతిభ కారణంగా పన్నెండు రోజుల పాటు ప్లాన్ చేసిన ఆ భారీ సాంగ్ షూటింగ్‌ను కేవలం మూడు రోజుల్లోనే విజయవంతంగా పూర్తి చేయడం విశేషం. ఈ అసాధారణమైన వేగం - నాణ్యత ఆ సమయంలో చిత్ర యూనిట్‌ను సైతం ఆశ్చర్యపరిచాయి. సదరు డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా వ్యవహరిస్తున్న మరో ప్రముఖ నటి కరిష్మా కపూర్ కూడా ఈ పాట విడుదలైన సమయంలో సృష్టించిన ఇంపాక్ట్ ఎలాంటిదో గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లోనే తాను ఈ పాటను చూసి ఫిదా అయ్యానని, ఊర్మిళా నటన - డ్యాన్స్ చాలా అద్భుతంగా ఉన్నాయంటూ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు కరిష్మా పేర్కొన్నారు. కాలపరీక్షను తట్టుకొని .. ఏళ్ల తరబడి బాలీవుడ్ చిత్రసీమలో అత్యంత ప్రజాదరణ పొందిన నృత్య గీతాలలో ఒకటిగా నిలిచిన -చమ్మా చమ్మా- పాట అసలు ఊర్మిళ కనిపించకపోయేదేమో! కాన దర్శకుడి పట్టుదల, విజన్- నటి ప్రతిభ కలిసి ఈ రోజుకీ పార్టీలు, వేడుకల్లో మార్మోగే ఒక యూనిక్ ట్రాక్‌ను ప్రేక్షకులకు అందించాయి. ఊర్మిళా మాతోండ్కర్ తాజాగా వెల్లడించిన ఈ ఆసక్తికరమైన విషయాలు... ఆ క్లాసిక్ ఐటమ్ పాట వెనుక ఉన్న కష్టాన్ని..ప్రయాణాన్ని అభిమానులకు ఒక సరికొత్త కోణంలో పరిచయం చేశాయి


## మా ఇంటి బంగారం : సీక్వెల్ ప్రకటించిన మేకర్స్.. ఎప్పుడొస్తుంది

సమంత హీరోయిన్‌గా, నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ఈ సంచలన విజయం అందించిన ఉత్సాహంతో చిత్ర యూనిట్ వైజాగ్‌లో గ్రాండ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ వేదికపై చిత్ర రచయిత, సమంత భర్త రాజ్ నిడిమోరు మాట్లాడుతూ.. మరో రెండేళ్లలో ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు ప్రకటించారు. మొదట ఆయన ప్రేక్షకులను అడగ్గా, ఆడియన్స్ నుండి వచ్చిన భారీ రెస్పాన్స్ చూసి పార్ట్-2ని అధికారికంగా కన్ఫర్మ్ చేశారు.ఇప్పటికే తన మైండ్‌లో ఒక ఐడియా ఉందని, సేమ్ టీమ్‌తోనే ఈ సీక్వెల్ ఉంటుందని రాజ్ తెలిపారు. ఒక సినిమాకు పార్ట్-2 చేయాలనే ఇన్‌స్పిరేషన్ తనకు కలగడం ఇదే తొలిసారి అని, రాబోయే చిత్రం డబుల్ ఫన్, డబుల్ ఎక్సైట్‌మెంట్‌తో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.





## ఆ యంగ్ హీరో సినిమా కోసం సుకుమార్..?

స్టార్ డైరెక్టర్ సుకుమార్ ఒకవైపు రామ్ చరణ్‌తో తన నెక్స్ట్ భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తూనే, మరోవైపు నిర్మాతగా తన 'సుకుమార్ రైటింగ్స్' బ్యానర్ పరిధిని మరింత విస్తరిస్తున్నాడు. ప్రియదర్శి హీరోగా ఓ కొత్త సినిమాను లాంచ్ చేసిన ఆయన, ఇప్పుడు టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టబోతున్నాడు. తాజా సమాచారం ప్రకారం.. స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా రాబోయే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సుకుమార్ సమర్పించనున్నాడు.ఈ చిత్రం ద్వారా సుకుమార్ వద్ద అసోసియేట్‌గా పనిచేస్తున్న బాబీ దర్శకుడిగా పరిచయం కానున్నాడట. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న సిద్ధూ, సుకుమార్ కాంబినేషన్‌లో సినిమా అనగానే ఇండస్ట్రీ వర్గాల్లో అప్పుడే అంచనాలు మొదలయ్యాయి.ఇప్పటికే 'కుమారి 21ఎఫ్', 'ఉప్పెన', 'విరూపాక్ష' వంటి వైవిధ్యమైన బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన సుకుమార్ రైటింగ్స్ బ్యానర్.. టాలీవుడ్‌లో కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ముందుంటోంది.



# ఆస్కార్ రేసులో మనోళ్లు: రాజమౌళి కంటే ముందే 'అకాడమీ' సభ్యత్వం పొందిన టాప్-10 భారతీయులు!



గత దశాబ్ద కాలంలో అకాడమీ తన సభ్యత్వ పరిధిని అంతర్జాతీయంగా విస్తరించడం ప్రారంభించిన తర్వాత రాజమౌళి కంటే ముందే పలువురు ప్రముఖ భారతీయ దర్శకులకు ఓటింగ్ హక్కు కల్పించింది. 113 సం.ల భారతీయ సినిమా హిస్టరీలో ఆస్కార్స్ పిలుపు అందుకున్న టాప్-10 సినీప్రముఖుల గురించి వివరాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సత్యజిత్ రే నుండి రాజమౌళి వరకు ఆస్కార్ -అకాడమీ-లో ఓటు హక్కు సాధించిన భారతీయ దిగ్గజాల వివరాల్లోకి వెళితే.... ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్స్ అవార్డులను నిర్వహించే -అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ అండ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్- నుండి ఆహ్వానం అందుకోవడం అనేది ఏ సినీ ప్రముఖుడికైనా అంతర్జాతీయంగా లభించే అత్యున్నత గౌరవం. ఇటీవలి కాలంలో దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు విశాల్ భరద్వాజ్ వంటి వారికి అకాడమీ ఓటు హక్కు కల్పిస్తూ ఈ ఏడాది ఎంపిక చేయడం భారతదేశంలో ఎంతో ఆసక్తిని రేకెత్తించింది. అయితే వీరి కంటే చాలా కాలం ముందే భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన పలువురు దిగ్గజ దర్శకులకు అకాడమీ నుండి ఈ అరుదైన గౌరవం, ఓటింగ్ హక్కు లభించాయి. సత్య జిత్ రే- మృణాల్ సేన్: భారతీయ సినిమా రంగానికి అంతర్జాతీయ వేదికపై మొట్టమొదటిసారిగా గొప్ప గుర్తింపు తెచ్చిన మాస్టర్ డైరెక్టర్ సత్యజిత్ రే. అకాడమీతో అత్యంత బలమైన అనుబంధం ఉన్న భారతీయ దర్శకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. రే అసాధారణ ప్రతిభను గుర్తించిన అకాడమీ సంస్థ 1992లో ఆయనకు అత్యున్నత -లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్- (గౌరవ ఆస్కార్) అవార్డును ప్రకటించింది. అప్పట్లో ఆయన తీవ్ర అనారోగ్యంతో కోల్‌కతాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో అకాడమీ ప్రతినిధులు స్వయంగా అక్కడికే వచ్చి ఆయనకు ఆస్కార్ అవార్డును అందజేసి గౌరవించారు. సత్యజిత్ రే సమకాలీనుడైన సమాంతర సినిమా దిగ్గజ దర్శకుడు మృణాళ్ సేన్ కూడా చాలా ఏళ్ల క్రితమే అకాడమీ నుండి ఆహ్వానం అందుకున్నారు. భువన్ షోమ్, ఒక ఊరి కథ వంటి సామాజిక స్పృహ గల అద్భుత చిత్రాలను తెరకెక్కించిన ఈయనను అకాడమీ తన ఓటింగ్ ప్యానెల్‌లోకి ఆహ్వానించింది. అలాగే చాలామందికి తెలియని మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే...1960ల కాలంలోనే లండన్, ఇటలీలలో పనిచేసి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న భారతీయ దర్శకుడు, ఎడిటర్ అమిత్ బోస్ అకాడమీలో సభ్యత్వం పొందిన తొలితరం భారతీయులలో ఒకరిగా నిలిచారు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555